విద్యార్థులను ప్రోత్సహిస్తే ఉత్తమ ఫలితాలు



విద్యార్థులు తయారు చేసిన నమూనాలను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే వివేకానంద్

ఎమ్మెల్యే వివేకానంద్

దుండిగల్: విద్యార్థుల్లో ఉన్న ప్రతిభను గుర్తించి, వారిని ప్రోత్సహిస్తే ఉత్తమ ఫలితాలు సాధిస్తారని ఎమ్మెల్యే కేపీ వివేకానంద్ అన్నారు. కుత్బుల్లాపూర్ డివిజన్ మాణిక్య నగర్‌లోని పల్లవి స్కూల్‌లో శనివారం సైన్స్ ఫేయిర్‌ను నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. సైన్స్ ఫేయిర్ విద్యార్థుల్లోని సృజనాత్మకతను వెలికి తీయడంతోపాటు అనుకున్నది సాధించగలమనే ఆత్మవిశ్వాసాన్ని పెంపొందిస్తాయన్నారు. కార్యక్రమంలో స్కూల్ చైర్మన్ గౌరీష్, డైరెక్టర్ విద్యాధర్, ప్రిన్సిపాల్స్ ధన లక్ష్మి, హరీష్, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు

మౌలిక సదుపాయాలు కల్పిస్తా

దుండిగల్ మున్సిపాలిటీ పరిధి డి. పోచంపల్లి సురక్ష గ్రీన్ మెడోస్ సంక్షేమ సంఘం సభ్యులు ఎమ్మెల్యే వివేకానంద్‌ను కలిసి కాలనీలో రోడ్ల నిర్మాణం, మంజీరా నీటి సౌకర్యం కల్పించాలని కోరుతూ వినతి పత్రం అందజేశారు. సంబంధిత అధికారులతో మాట్లాడి సమస్యను పరిష్కరిస్తానని వారికి హామీ ఇచ్చారు.

నిధులు మంజూరు చేయాలని వినతి



జెడ్సీకి వినతిపత్రం అందజేస్తున్న సంక్షేమ సంఘం సభ్యులు

రంగారెడ్డినగర్: అంతర్గత సీసీ రోడ్ల నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని విజయ్‌నగర్ కాలనీ సంక్షేమ సంఘం ప్రతినిధులు శనివారం జోనల్ కమిషనర్ అపూర్వ చౌహాన్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా కాలనీ ప్రధాన కార్యదర్శి మల్లం శ్రీనివాస్‌గౌడ్, వర్కింగ్ ప్రెసిడెంట్ బాలరాజు మాట్లాడుతూ.. భూగర్భ డ్రైనేజీలైన్‌లు వేయడంతో అంతర్గత రోడ్లు ధ్వంసమయ్యాయన్నారు. స్థానికులు రాకపోకలు సాగించేందుకు ఇబ్బందికరంగా మారిందని, నిధులు మంజూరు చేసి సీసీ రోడ్లు వేయాలని కోరారు. దీనిపై జోనల్ కమిషనర్ సానుకూలంగా స్పందించారు. కార్యక్రమంలో ఉపాధ్యక్షులు శ్రీధర్, మహేష్, సంయుక్త కార్యదర్శి మమత, పద్మ, స్వర్ణలత తదితరులు పాల్గొన్నారు.

సమస్యలను కౌన్సెలింగ్ ద్వారా పరిష్కరించుకోవచ్చు



కార్యక్రమంలో మాట్లాడుతున్న ఇన్‌స్పెక్టర్ మల్లేష్



కార్యక్రమంలో పాల్గొన్న మహిళలు

జీడిమెట్ల: మహిళలకు సంబంధించిన సమస్యలను కౌన్సెలింగ్ ద్వారా పరిష్కారం చేసుకోవచ్చునని జీడిమెట్ల ఇన్‌స్పెక్టర్ గడ్డం మల్లేష్ అన్నారు. శనివారం జీడిమెట్ల పీఎస్ పరిధిలోని చింతల్‌లో సీడీఈడబ్ల్యూ కౌన్సెలింగ్ కేంద్రాన్ని ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వాలు మహిళల కోసం తీసుకువచ్చిన చట్టాల ద్వారా వారి సమస్యలకు సరైన పరిష్కారం దొరుకుతుందన్నారు. సీడీఈడబ్ల్యూ సెంటర్‌లలో భార్యాభర్తల మధ్య జరిగే గొడవలకు కౌన్సెలింగ్ నిర్వహించనున్నారని ఆయన తెలిపారు. కార్యక్రమంలో ఉమెన్ సేఫ్టీ వింగ్, పీఎంయూ బృందం, సీడీఈడబ్ల్యూ జీడిమెట్ల సిబ్బంది సంతోషి, వెంకట నర్సమ్మ, విజయ, ఎన్‌జీవో ప్రతినిధులు పాల్గొన్నారు.

ఎంఎల్‌ఆర్‌ఐటీఎంలో ట్రెడిషనల్ డే



పోతరాజుల విన్యాసాలు



సంక్రాంతి సంబరాలు

దుండిగల్: మర్రి లక్ష్మణ్‌రెడ్డి ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ మేనేజ్‌మెంట్, ఫార్మసీ కళాశాలల్లో శనివారం ట్రెడిషనల్ డే ను ఘనంగా నిర్వహించారు. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలను చాటిచెప్పే ప్రకృతి పండుగగా విద్యార్థులు, అధ్యాపకులు సంప్రదాయ దుస్తులు ధరించారు. బతుకమ్మ ఆట పాటలు, కోలాటాలతో అలరించారు. వినాయక చవితి, బతుకమ్మ, బోనాలు , సంక్రాంతి, దసర, ఓనం , రంజాన్, క్రిస్మస్ వేడుకలను జరుపుకున్నారు. కార్యక్రమంలో మల్కాజిగిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి, కళాశాల కోశాధికారి మర్రి మమత, చైర్మన్ మర్రి లక్ష్మణ్ రెడ్డి, కళాశాల బోర్డ్ ఆఫ్ డైరెక్టర్స్ అనుశ్రేయ రెడ్డి, డైరెక్టర్ డా. పి శ్రీధర్, ఫార్మసీ ప్రిన్సిపాల్ డా. అర్ణబ్ మాలిక్, క్లబ్ 64 నిర్వాహకులు డా ప్రవంతి, విజయ సింహ, అప్పారావు పాల్గొన్నారు.

ఆహార నాణ్యతపై స్పెషల్ ఫోకస్

- విద్యాసంస్థల్లో, హాస్టళ్లలో తనిఖీలు నిర్వహిస్తున్న అధికారులు
- మండల స్థాయిలో స్పెషల్ ఆఫీసర్‌లు
- జిల్లా స్థాయిలో అదనపు కలెక్టర్ విజయేందర్‌రెడ్డి నేతృత్వంలో కమిటీ



విద్యార్థులతో భోజనం చేస్తున్న వినోద్‌కుమార్



భోజనం చేస్తున్న డీఈఓ విజయకుమారి

సాక్షి, సిటీబ్యూరో: విద్యా సంస్థలు, సంక్షేమ హాస్టళ్లు, ఆసుపత్రుల్లో ఆహార నాణ్యత పర్యవేక్షణకు స్పెషల్ ఆఫీసర్లను నియమించిన అధికార యంత్రాంగం వారి ఆరోగ్యంపై ఎప్పటికప్పుడు చర్యలు తీసుకునేందుకు టాస్క్ ఫోర్స్ టీమ్‌ను రంగంలోకి దింపింది. రాష్ట్రంలోని పలు చోట్ల విద్యాసంస్థలు, హాస్టళ్లలో విద్యార్థులు ఫుడ్ పాయిజన్ వంటి సంఘటనలతో ఆసుపత్రుల పాలైన విషయం తెల్సిందే. ఈ నేపథ్యంలోనే విద్యా సంస్థలు, హాస్టళ్లకు పంపిణీ చేస్తున్న ఆహార పదార్థాల నాణ్యత పట్ల ప్రభుత్వం కఠినంగా వ్యవహరిస్తోంది. అందులో భాగంగా మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలో ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల కోసం అమలు చేస్తున్న మధ్యాహ్న భోజనం మొదలు.. సంక్షేమ హాస్టళ్లు, గురుకులాలు, వసతి గృహాలు, అంగన్‌వాడీ కేంద్రాలు, విద్యాసంస్థలు, ప్రభుత్వ ఆసుపత్రుల్లో ఆహార నాణ్యతపై నిఘాపెట్టారు. పర్యవేక్షణకు స్పెషల్ ఆఫీసర్లతో సహా టాస్క్ ఫోర్స్ టీమ్ జిల్లా అధికార యంత్రాంగం చర్యలు తీసుకుంటోంది. హాస్టళ్లు, విద్యాసంస్థల్లో ఆహార నాణ్యతను తనిఖీ చేసేందుకు ప్రభుత్వ పాఠశాలలు, హాస్టళ్ల వారీగా టాస్క్ ఫోర్స్ టీమ్‌లకు బాధ్యతలు అప్పగించిన జిల్లా యంత్రాంగం మండలాల వారీగా 15 మంది జిల్లా స్థాయి అధికారులను స్పెషల్ ఆఫీసర్లుగా నియమంచారు. జిల్లా స్థాయిలో కూడా జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) విజయేందర్‌రెడ్డి నేతృత్వంలో టాస్క్ ఫోర్స్ టీమ్ ఏర్పాటైంది. ఈ టీమ్‌లో సభ్యులుగా డీఎంహెచ్‌ఓ డాక్టర్. రఘునాథ్ స్వామి, డీఈఓ విజయకుమారి, ఎస్సీ, ఎస్టీ సంక్షేమ, అభివృద్ధి శాఖల జిల్లా అధికారి వినోద్ కుమార్, ఫుడ్ సేఫ్టీ ఆఫీసర్ జగన్నాథం, మల్కాజిగిరి జిల్లా కేంద్రం ఆసుపత్రి డాకర్ సునీత, గురుకుల పాఠశాలల జిల్లా అధికారి రజనీకాంత్, ఫుడ్ సేఫ్టీ డిజిగ్నేటిడ్ ఆఫీసర్ డా. మల్లీశ్వరి ఉన్నారు. స్థానికంగా కూడా విద్యా సంస్థలు, హాస్టళ్ల వారీగా కూడా టీమ్‌లను నియమించేందుకు చర్యలు తీసుకుంటున్నారు.

ఆహార నాణ్యతపై నిఘా..

విద్యార్థుల, ప్రజల ఆరోగ్యాన్ని కాపాడే విషయంతోపాటు అత్యవసర పరిస్థితులలో సమర్థవంతమైన చర్యలను తీసుకునేందుకు ఈ టీమ్ అన్ని విధాలుగా వ్యవహరిస్తోంది. జిల్లాలో విద్యా సంస్థలు, ఎస్సీ, గిరిజన, బీసీ, మైనార్టీ, సంక్షేమ హాస్టళ్లు, ప్రభుత్వ ఆసుపత్రులు, వైద్య కళాశాలలు, అంగన్‌వాడీ కేంద్రాలు, గురుకులాలు, రెసిడెన్షియల్ స్కూళ్లలో ఆహార నాణ్యతను పర్యవేక్షించే బాధ్యతను ఈ టీమ్ చూసుకుంటోంది. ఈ టీమ్ అవసరమైతే ప్రతిరోజు భోజనం తయారు చేసే ముందు స్టోర్ రూమ్, వంట తర్వాత ఆహార నాణ్యత, ప్రమాణాల పాటిస్తున్నట్టు నిర్ధారించాల్సి ఉంటోంది. వంట వండిన తర్వాత ఆహార నాణ్యతను టీమ్ సభ్యులు రుచి చూసి పరిశీలించిన తర్వాత విద్యార్థులకు అందించాల్సి ఉంటోంది. ప్రతిరోజు ఈ బాధ్యతలను విధిగా పూర్తి చేయాల్సి ఉంటోంది.

తనిఖీల్లో స్పెషల్ ఆఫీసర్లు..

మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలోని 15 మండలాల పరిధిలో స్పెషల్ ఆఫీసర్లు విద్యా సంస్థలు, హాస్టళ్లలో ఆహార నాణ్యతపై తనిఖీలు నిర్వహిస్తున్నారు. జిల్లాలో 507 ప్రభుత్వ పాఠశాలలు, 5 ఎస్సీ హైస్కూల్ హాస్టళ్లు, 7 కాలేజీ హాస్టళ్లు ఉన్నాయి. ఒక ఎస్సీ హైస్కూల్ హాస్టల్ ఉండగా, ఐదు కాలేజీ హాస్టళ్లు ఉన్నాయి. మైనార్టీశాఖ పరిధిలో 8 రెసిడెన్షియల్ స్కూళ్లు ఉన్నాయి. బీసీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో 12 కాలేజీ హాస్టళ్లు కొనసాగుతున్నాయి.

ప్రభుత్వ ఆసుపత్రులు, అంగన్‌వాడీ కేంద్రాలు, ప్రైవేట్ పాఠశాల, కాలేజీ హాస్టళ్లు ఉన్నాయి. వీటి అన్నింటిలో స్పెషల్ ఆఫీసర్లు శుక్రవారం నుంచి తనిఖీలు నిర్వహిస్తున్నారు. తనిఖీలు నిర్వహించి తదుపరి మూడు రోజులు జిల్లా అధికార యంత్రాంగానికి ఆహార నాణ్యత తదితర విషయాలపై నివేదిక అందజేయాల్సి ఉంటోంది.

రేపు బీజేపీ ఆధ్వర్యంలో నిరసనలు

సుభాష్‌నగర్: బీజేపీ రాష్ట్ర నాయకత్వం ఇచ్చిన పిలుపు మేరకు సోమవారం కాంగ్రెస్ పాలనపై నిరసనలు చేపట్టనున్నట్లు బీజేపీ సుభాష్‌నగర్ డివిజన్ అధ్యక్షుడు కంది శ్రీరాములు శనివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. సంవత్సర కాలంలో కాంగ్రెస్ ప్రభుత్వ పాలన ఆరు అబద్ధాలు, 66 మోసాలతో ప్రజలను మభ్యపెట్టిందన్నారు. సూరారం కాలనీలోని రాజీవ్ గృహకల్ప అంబేడ్కర్ చౌరస్తాలో సాయంత్రం 5 గంటలకు స్ట్రీట్ కార్నర్ మీటింగ్ ఉంటుందని, బీజేపీ నాయకులు, కార్యకర్తలు, స్థానిక ప్రజలు పాల్గొనాలని ఆయన కోరారు.

గొడవపడి గొలుసుతో పరార్

కుత్బుల్లాపూర్: గుర్తు తెలియని వ్యక్తులు ఓ వ్యక్తితో గొడవపడి, మెడలోని బంగారు గొలుసును లాక్కొని పరారయ్యారు. ఈ ఘటన పేట్‌బషీరాబాద్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం.. జీడిమెట్ల డివిజన్ వెన్నెలగడ్డకు చెందిన పృథ్వీరాజు 29న రాత్రి 11.15 గంటల సమయంలో తన స్నేహితుడు ఉమామహేశ్వరరావుతో కలిసి సుచిత్రలోని వెస్ట్‌సైడ్ షాపింగ్‌మాల్ మీదుగా బైక్‌పై వెళ్తున్నాడు. ఈ క్రమంలో అటుగా వచ్చిన ఐదుగురు గుర్తు తెలియని వ్యక్తులు అకారణంగా ఉమామహేశ్వరరావుతో గొడవకు దిగారు. వారిని వారించేందుకు యత్నించిన పృథ్వీరాజు మెడలోంచి 11 గ్రాముల బంగారు గొలుసును లాక్కొని పరారయ్యారు. బాధితుడి ఫిర్యాదు మేరకు శనివారం పేట్‌బషీరాబాద్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

సీఎంఆర్‌ఎఫ్‌తో పేదలకు కార్పొరేట్ వైద్యం



చెక్కులందజేస్తున్న మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలంగౌడ్

కుత్బుల్లాపూర్: సీఎంఆర్‌ఎఫ్‌తో పేదలకు కార్పొరేట్ వైద్యం అందుతుందని మాజీ ఎమ్మెల్యే, కాంగ్రెస్ సీనియర్ నేత కూన శ్రీశైలంగౌడ్ అన్నారు. అనారోగ్యంతో బాధపడుతున్న వెంకటమ్మ, రాధికలకు రూ.51 వేలు, రూ.40 వేల సీఎంఆర్‌ఎఫ్ చెక్కులు మంజూరయ్యాయి. ఆ చెక్కులను శనివారం షాపూర్‌నగర్‌లోని నివాసంలో అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..అర్హులైన ప్రతి ఒక్కరూ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అదే విధంగా పలు సంక్షేమ సంఘాల ప్రతినిధులు స్థానిక సమస్యలపై వినతులు అందజేయగా.. పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో బండి శ్రీనివాస్‌గౌడ్, బొబ్బ రంగారావు, దుగ్యాల సాయిప్రసాద్, రామచంద్రారెడ్డి, ప్రవీణ్, రంగారావు, నవీన్ కుమార్, శ్రీనివాస్‌రెడ్డి, నారాయణ తదితరులు పాల్గొన్నారు.

ఆశ చూపి నగలు దోచుకున్నారని ఫిర్యాదు

- పొంతన లేని సమాధానాలు చెప్తున్న బాధితురాలు
- సీసీ ఫుటేజీ ఆధారంగా దర్యాప్తు చేస్తున్న పోలీసులు

దుండిగల్: నడుచుకుంటూ వెళ్తున్న తనతో మాట కలిపి గుర్తు తెలియని వ్యక్తులు నగలు దోచుకున్నారంటూ ఓ మహిళ దుండిగల్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. పోలీసుల వివరాల ప్రకారం.. మల్లంపేట ప్రాంతానికి చెందిన పద్మ(55) శనివారం ఉదయం మార్కెట్‌కు నడుచుకుంటూ వెళ్తుండగా గుర్తు తెలియని ముగ్గురు వ్యక్తులు వచ్చి ఆమెతో మాటలు కలిపారు. బంగారంపై ప్రస్తుతం ఉన్న మార్కెట్ ధర కన్నా ఎక్కువ డబ్బులు చెల్లిస్తామని ఆశ చూపారు. వాళ్ల మాటలను నమ్మిన పద్మ ఒంటిపై ఉన్న రెండు తులాల బంగారు గొలుసు, తులం కమ్మలు, ఉంగరాలు తీసి వారికి ఇచ్చింది. వాళ్లు చేతి రుమాలులో డబ్బులు పెట్టి ఆమెకు ఇచ్చారు. ఇంటికి వెళ్లి చూసే సరికి అందులో తెల్ల కాగితాలు ఉన్నాయి. బాధితురాలు దుండిగల్ పోలీసులను ఆశ్రయించి ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. కాగా పద్మ పోలీసులకు పొంతన లేని సమాధానాలు చెప్తుంది. ఒక సారి ఆటోలో వచ్చి తన ఫోన్ తీసుకున్నారని, మరో సారి తన ఫోన్ పగలగొట్టారని పేర్కొంది. సీసీ ఫుటేజీలను పరిశీలిస్తూ దర్యాప్తు చేస్తున్నామని డీఐ సతీష్ తెలిపారు.

ఎస్కలేటర్ పని చేయక.. వంతెన పైకి వెళ్లలేక

రోడ్డు దాటేందుకు ఇబ్బందులు పడుతున్న వృద్ధులు, దివ్యాంగులు



తెరుచుకోని లిఫ్ట్



పనిచేయని ఎస్కలేటర్

రంగారెడ్డినగర్: ఎట్టకేలకు రెండేళ్ల తరువాత ఫుట్‌ఓవర్ బ్రిడ్జి అందుబాటులోకి వచ్చినా పాదచారులకు ఇబ్బందులు తప్పడం లేదు. షాపూర్‌నగర్ చౌరస్తాలో 2021లో ఫుట్‌ఓవర్ బ్రిడ్జి నిర్మాణానికి రూ.1.80 కోట్ల నిధులతో శ్రీకారం చుట్టిన సర్కిల్ అధికారులు 2022 చివరి నాటికి పనులు పూర్తి చేశారు. ఎస్కలేటర్ ఏర్పాటు, చిన్నపాటి పెండింగ్ పనులతో మరో ఆరు నెలలు కాలయాపన చేశారు. 2024 సెప్టెంబర్‌లో ఎట్టకేలకు పాదచారుల వంతెనను అందుబాటులోకి తెచ్చారు. అయితే ఎస్కలేటర్, లిఫ్టులు పనిచేయకపోవడంతో వృద్ధులు, దివ్యాంగులు వంతెన పైకి వెళ్లేందుకు అష్టకష్టాలు పడుతున్నారు. దీంతో చాలా మంది వంతెన ఉన్నా రోడ్డు మధ్య నుంచే రాకపోకలు సాగిస్తున్నారు. కోట్లాది రూపాయల ప్రజాధనం వెచ్చించి అందుబాటులోకి తెచ్చిన ఫుట్‌ఓవర్ బ్రిడ్జి అధికారుల నిర్లక్ష్యం కారణంగా పాదచారులు వినియోగించుకోలేక పోతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు ఎస్కలేటర్, లిఫ్టులు పనిచేసేలా చర్యలు తీసుకుంటే వృద్ధులు, దివ్యాంగులకు ఉపయోగకరంగా ఉంటుందని పలువురు పేర్కొంటున్నారు.

నిధులు సరే.. పనుల ప్రారంభమెప్పుడు?



డ్రైనేజీ నిర్మాణ విషయంపై ఆరా తీస్తున్న జీఎం అశోక్, డీజీఎం రాజేశ్, ఏఈ అనూష

- పనులు ప్రారంభించకుండానే చేతులెత్తేసిన కాంట్రాక్టర్!
- డ్రైనేజీ అవుట్‌లెట్ లేక కాలనీవాసుల ఇబ్బందులు

కుత్బుల్లాపూర్: అన్నీ ఉన్నా అల్లుడి నోట్లో శని ఉందన్న చందంగా మారింది ఆ కాలనీల పరిస్థితి. డ్రైనేజీ నిర్మాణం కోసం నిధులు మంజూరైనా కాంట్రాక్టర్ పనులు చేయకపోవడంతో ఆయా కాలనీల ప్రజలు అధికారుల చుట్టూ తిరుగుతూ ప్రాధేయపడుతున్నారు. కుత్బుల్లాపూర్ సర్కిల్ జీడిమెట్ల డివిజన్ వుడ్స్ కాలనీ పేట్ బషీరాబాద్ విద్యుత్ సబ్ స్టేషన్ నుంచి సెయింట్ ఆన్స్ స్కూల్ నాలా వరకు సుమారు రూ. 2.15 కోట్ల నిధులు మంజూరు అయ్యాయి. ఇక్కడ డ్రైనేజీ నిర్మాణం చేపట్టేందుకు గతంలో కాంట్రాక్టర్ పనులు చేస్తున్న క్రమంలో పలువురు అడ్డుకున్నట్లు తెలిసింది. ఈ విషయంపై స్థానిక సంక్షేమ సంఘాల ప్రతినిధులు కాంట్రాక్టర్‌ని కలిసి పనులు చేయాలని వేడుకున్నారు. ఆ కాంట్రాక్టర్ మాత్రం పనులు చేయకుండా ఉండటంతో ఇటీవల సంక్షేమ సంఘం ప్రతినిధులు కుత్బుల్లాపూర్ వాటర్ వర్క్స్ జీఎం అశోక్‌ను కలిసి తమ గోడును వెళ్లబోసుకున్నారు.

డ్రైనేజీలైన్ లేకపోవడంతో ఇబ్బందులు

జీడిమెట్ల డివిజన్ పరిధిలో వుడ్స్ కాలనీతోపాటు డిలైట్ కమ్యూనిటీ విల్లాస్, ఏఎస్‌ఆర్ అపార్ట్‌మెంట్, వైష్ణవి విడోస్, వినాయక నగర్, రంగారెడ్డి బండ కాలనీ వాసులు డ్రైనేజీ అవుట్ లైన్ లేకపోవడంతో ఎన్నో ఏళ్లుగా ఇబ్బందులు పడుతున్నారు. ఈ విషయంపై ఎమ్మెల్యే వివేకానంద్, కార్పొరేటర్ తారాచంద్రారెడ్డి, ఎంపీ ఈటల రాజేందర్‌ను కలిసి నిధులు కేటాయించాలని వేడుకున్నారు. డ్రైనేజీ నిర్మాణం కోసం నిధులు మంజూరయ్యాయి. తనను పనులు చేయొద్దని ఇబ్బందులకు గురి చేస్తున్నారని కాంట్రాక్టర్ చేతులెత్తేయడం విశేషం. కాలనీల సంక్షేమ సంఘం ప్రతినిధులు అధికారులను కలిసి.. తాము నిలబడి పనులు చేయించుకుంటామని, సహకరించాలని కోరారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి డ్రైనేజీ నిర్మాణం చేపట్టాలని ఆయా కాలనీల ప్రజలు కోరుతున్నారు.

ఆదేశాలు వస్తే ప్రారంభిస్తాం

గతంలో కొన్ని ఇబ్బందుల వల్ల పనులు ఆగాయి. ఉన్నత అధికారుల నుంచి పనులు ప్రారంభించాలని ఆదేశాలు వస్తే వెంటనే ప్రారంభిస్తాం. ప్రతి ఒక్కరూ సహకరించాలి.

– రాజేష్, వాటర్ వర్క్స్ డీజీఎం

7న గీతా జయంతి మహోత్సవం

నిజాంపేట్: నిజాంపేట్ కార్పొరేషన్ ప్రగతినగర్‌లోని శ్రీపట్టాభి రామాంజనేయస్వామి ఆలయ ప్రాంగణంలో ఈ నెల 7న గీతా జయంతి మహోత్సవాన్ని నిర్వహించనున్నట్లు నిర్వాహకులు గీతా సేవీ, డాక్టర్ ఎం.ఆర్.ఎస్.రాజు శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. సాయంత్రం 5 గంటల నుంచి జరిగే గీతా జయంతి మహోత్సవ కార్యక్రమంలో భాగంగా భగవద్గీతా పారాయణం, భజనలు, పిల్లలకు క్విజ్, రంగులు పూరించే(కలరింగ్) పోటీలు, భగవద్గీతను కంఠస్థం చేసిన వారికి సన్మానం తదితర కార్యక్రమాలు ఉంటాయని పేర్కొన్నారు. కార్యక్రమాల్లో పాల్గొనే వారు 93940 54876 నెంబర్‌ను సంప్రదించి పేరు నమోదు చేసుకోవాలన్నారు.

డంపింగ్ వ్యర్థాలను తరలించాలి



సొసైటీ సభ్యులతో మేయర్ నీలారెడ్డి, కమిషనర్ సాబేర్ అలీ

నిజాంపేట్: ప్రజలకు ఇబ్బంది కలుగకుండా సుపరిపాలన అందించేందుకు కృషి చేస్తున్నామని నిజాంపేట్ మేయర్ కొలన్ నీలారెడ్డి అన్నారు. బాచుపల్లి హిల్‌కౌంటీ విల్లా ఓనర్స్ మ్యూచువల్ ఎయిడెడ్ కో ఆపరేటీవ్ సొసైటీ సభ్యులు శనివారం మేయర్, కమిషనర్ సాబేర్ అలీలను కలిసి వినతిపత్రం అందజేశారు. తమ కాలనీని ఆనుకుని ఉన్న డంపింగ్ యార్డు వ్యర్థాల నిల్వల వల్ల దుర్వాసనను భరించలేకపోతున్నామని, వెంటనే వ్యర్థాలను తరలించేలా ఏర్పాట్లు చేయాలని కోరారు.

వైద్య శిబిరానికి విశేష స్పందన



వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

రంగారెడ్డినగర్: డాక్టర్ కేర్ హోమియోపతి, కొంపల్లికి చెందిన టూట్ డెంటల్ ఆసుపత్రి సౌజన్యంతో శనివారం నిర్వహించిన వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. రంగారెడ్డినగర్ డివిజన్ గాంధీనగర్‌లోని మహాత్మా గాంధీ కమ్యూనిటీ హాల్‌లో ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు వైద్య శిబిరం కొనసాగింది. డాక్టర్ కేర్ హోమియోపతి, టూట్ డెంటల్ వ్యవస్థాపకులు డాక్టర్ ఎ.ఎం.రెడ్డి, డాక్టర్ సృజన పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందజేశారు. శిబిరంలో సుమారు 150 మందికి పరీక్షలు చేశారు. వివేకానంద యూత్ అసోసియేషన్ అధ్యక్షుడు జల్దా లక్ష్మీనాథ్, సభ్యులు పాల్గొన్నారు.

ఫుట్‌పాత్ ఆక్రమణల తొలగింపు



కుత్బుల్లాపూర్: ఫుట్‌పాత్ ఆక్రమణలు ఉపేక్షించేది లేదని అల్వాల్ ట్రాఫిక్ సీఐ నాగరాజు అన్నారు. శనివారం ట్రాఫిక్ పోలీసుల ఆధ్వర్యంలో ఆక్రమణలపై స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. గోదావరి హోమ్స్ నుంచి భాగ్యలక్ష్మి కాలనీ, అదే విధంగా గోదావరి హోమ్స్ నుంచి కుత్బుల్లాపూర్ రోడ్డులో ఫుట్‌పాత్‌లపై వెలిసిన డబ్బాలు, దుకాణాలను జేసీబీతో తొలగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఫుట్‌పాత్‌లపై దుకాణాలను ఏర్పాటు చేయడంతో సర్వీసు రోడ్లపై తరచూ ట్రాఫిక్ జామ్ అవుతోందని, మరోసారి ఆక్రమణలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవన్నారు. కార్యక్రమంలో జీహెచ్‌ఎంసీ టౌన్ ప్లానింగ్ అధికారులు, అల్వాల్ ట్రాఫిక్ పోలీసులు పాల్గొన్నారు.

గణితంతో ఉజ్వల భవిష్యత్

కూకట్‌పల్లి: జాతీయ గణిత దినోత్సవం సందర్భంగా శనివారం జడ్పీహెచ్‌ఎస్‌లో తెలంగాణ గణిత ఫోరం జిల్లా శాఖ ఆధ్వర్యంలో కూకట్‌పల్లి, బాలానగర్, బాచుపల్లి మండలాల పదవ తరగతి విద్యార్థులకు మండల స్థాయి గణిత ప్రతిభా పరీక్ష నిర్వహించారు. ఈ పరీక్షకు ఆయా మండలాల పరిధిలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో చదువుతూ గణితంలో అత్యుత్తమ ప్రతిభ కలిగి ఎంపిక చేసిన తెలుగు, ఇంగ్లీష్ మీడియంకు ముగ్గురు చొప్పున విద్యార్థులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా విద్యాధికారులు హరీష్ చంద్ర కిషన్, రామకృష్ణ మాట్లాడుతూ.. గణితంలో పట్టు ఉంటే ఉజ్వల భవిష్యత్ ఉంటుందన్నారు. గణితాన్ని కష్టంగా కాకుండా ఇష్టంగా భావించి సాధన చేస్తే అత్యుత్తమ ఫలితాలు ఉంటాయన్నారు. మండలాల వారీగా పరీక్షలో ఉత్తమ ప్రతిభ కనబర్చిన మొదటి, రెండవ, మూడవ స్థానాల్లో నిలిచిన విద్యార్థులను జిల్లా స్థాయి ప్రతిభా పరీక్షకు ఎంపిక చేసి వారికి ప్రశంసాపత్రం, మెడల్స్ అందజేశారు. కార్యక్రమంలో గణిత ఫోరం జిల్లా గౌరవ అధ్యక్షులు గోవింద్, మేడ్చల్ జిల్లా ఏఎస్ఓ అయ్యన్న, హెచ్‌ఎం నరేందర్‌రెడ్డి, పరీక్ష కేంద్రం కన్వీనర్‌లు పర్మగళ్ల నర్సింహులు, దమయంతి, శంకరప్ప, గణిత ఉపాధ్యాయులు ప్రసన్న భారతి, ఇందుమతి, కుసుమ తదితరులు పాల్గొన్నారు.



చింతల్ వేంకటేశ్వరనగర్‌లోని బచ్‌పన్ ప్లేస్కూల్‌లో శనివారం శీతాకాల ఆహ్వాన కార్యక్రమాన్ని నిర్వహించారు. పాఠశాల ఆవరణలో కశ్మీర్ వాతావరణాన్ని తలపించేలా మంచు కొండలు, వివిధ రకాల పూలతోటలతో అలంకరించారు. చిన్నారులు స్వెటర్లు ధరించి సందడి చేశారు.

– కుత్బుల్లాపూర్